

పంటు రాకపోకలు పునరుద్ధరణ

ప్రజాశక్తి - నరసాపురం



గోదావరిలో పంటు..

ఉభయగోదావరి జిల్లాల మధ్య నిలిచిన పంటు రాకపోకల్ని ఆదివారం నుంచి అధికారులు పునరుద్ధరించారు. గతవారం రోజులుగా గోదావరికి వరదలు తాకడంతో ముందస్తుగా మండల పరిషత్ అధికారులు సఖినేటిపల్లి-మాదవాయిపాలెం రేవుల మధ్య పంటి రాకపోకల్ని నిలుపుదల చేశారు. దీంతో లంక ప్రజలు చించినాడ మీదుగా చుట్టూ తిరిగి పట్టణానికి రావాల్సి వచ్చేంది. ప్రస్తుతం వరద పూర్తిగా తగ్గుముఖం పట్టడంతో రేవుల మధ్య పంటు రాకపోకలకు అనుమతించారు. ఆదివారం నుంచి ఒక పంటు మాత్రమే నిర్వహకులు రేవుల మధ్య తిప్పారు.

జిల్లాలపై కమిటీ.. ఉన్నట్టా.. లేనట్టా..!

జిల్లాల విభజనలో లోపాలు, సరిహద్దు సమస్యలపై మంత్రులతో కమిటీ ఏర్పాటు

నెల రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆగస్టు 6న కేబినెట్‌లో నిర్ణయం

గడువు దాటినా జిల్లాలో పర్యటించని కమిటీ

గణపవరం మండలం మార్పుపై తీవ్ర అలజడి

నూజివీడు, కైకలూరు నియోజకవర్గాలపై ఉత్కంఠ

'పోలవరం' జిల్లా ఏర్పాటు జరిగేనా?

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లాల విభజనలో లోపాలు, సరిహద్దు సమస్యలపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రుల కమిటీ ఉన్నట్టా.. లేనట్టా అన్న సందేహాలు అలుముకున్నాయి. మంత్రుల కమిటీ జిల్లాలో పర్యటించిన నెల రోజుల్లో నివేదిక ఇవ్వాలని, డిసెంబర్‌లోపు జిల్లాలకు సంబంధించిన మార్పులు, చేర్పులు పూర్తవ్వాలని ఆగస్టు ఆరో తేదీన జరిగిన కేబినెట్ సమావేశంలో నిర్ణయం జరిగింది. నెల రోజుల్లో నివేదిక ఇవ్వడం పక్కకు పెడితే ఇప్పటి వరకూ మంత్రుల కమిటీ జిల్లాకు రాలేదు. దీంతో జిల్లాల విభజనపై ఏర్పాటు చేసిన మంత్రుల కమిటీ ఏమైందన్న చర్చ జనాల్లో కొనసాగుతోంది. గణపవరం మండలాన్ని ఏలూరు జిల్లాలో కలపనున్నట్లు ప్రచారం సాగుతుండడంతో అక్కడి నాయకులు, ప్రజల్లో తీవ్ర అలజడి నెలకొంది. అదేవిధంగా ఏలూరు జిల్లాలోని నూజివీడు, కైకలూరు నియోజకవర్గాల ప్రజల్లోనూ ఉత్కంఠ కొనసాగుతోంది. మంత్రుల కమిటీ జిల్లా పర్యటనకు వస్తే జిల్లాల మార్పులు, చేర్పులపై వినతులు ఇవ్వాలని జిల్లాలోని పలు రాజకీయ పార్టీలు, ప్రజలు సైతం ఎదురుచూస్తున్నారు. మంత్రుల కమిటీ మాత్రం పత్తాలేకుండా పోయింది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలకు సంబంధించిన మార్పులు, చేర్పులు చేపట్టాలని స్థానిక ప్రజానీకం కోరుతున్నారు. కైకలూరు, నూజివీడు నియోజకవర్గాల ప్రజలు తమ ప్రాంతాలను ఎన్‌టిఆర్, కృష్ణా జిల్లాల్లో కలపాలని ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్న పరిస్థితి. జిల్లాల విభజన సందర్భంగా అప్పట్లో కైకలూరు నియోజకవర్గ ప్రజలు, నాయకులంతా తమ నియోజకవర్గాన్ని కృష్ణా జిల్లాలో కలపాలని పట్టుబట్టారు. నూజివీడు నియోజకవర్గ ప్రజలు తమ ప్రాంతాన్ని ఎన్‌టిఆర్ జిల్లాలో కలపాలని ఆందోళనలు సైతం చేశారు. అప్పటి వైసిపి ప్రభుత్వం పార్లమెంట్ స్థానాల ప్రాతిపదికన జిల్లాల విభజనను పూర్తి చేసింది. దీంతో ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గంలో ఉన్న నూజివీడు, కైకలూరు నియోజకవర్గాలను ఏలూరు జిల్లాలో కలిపారు. తమకు జిల్లా కేంద్రం ఏలూరు రావడానికి తీవ్ర ఇబ్బందిగా ఉందని, రవాణా సదుపాయాలు సరిగ్గా లేవని తమ ప్రాంతాలను ఏలూరు జిల్లా నుంచి తప్పించాలని నూజివీడు, కైకలూరు నియోజకవర్గాల ప్రజలు, రాజకీయ నాయకులు సైతం కోరుతున్నారు. గడిచిన ఎన్నికల్లో నూజివీడులో జరిగిన బహిరంగ సభలో ఇదే విషయాన్ని చంద్రబాబు దృష్టికి అక్కడి నాయకులు తీసుకెళ్లారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నూజివీడు నియోజకవర్గాన్ని ఎన్‌టిఆర్ జిల్లాలో కలుపుతామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఇప్పుడు ప్రజలు, నాయకులు అదే విషయాన్ని పదేపదే ప్రస్తావిస్తున్నారు. కైకలూరు నియోజవకర్గానికి చెందిన నాయకులు సైతం తమ ప్రాంతాన్ని కృష్ణా జిల్లాలో కలపాలని ప్రభుత్వానికి వినతిపత్రాలు ఇవ్వడం కొనసాగుతోంది. జిల్లాల విభజన సమస్యలపై నెల రోజుల్లో నివేదిక ఇవ్వాలని కేబినెట్‌లో నిర్ణయం తీసుకోవడంతో తమ సమస్యలు చెప్పుకోవచ్చని అంతా ఎదురుచూస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో కలిసిన గోపాలపురం నియోజవకర్గంలో ఉన్న ద్వారకాతిరుమల మండలాన్ని అప్పట్లో ప్రజాభీష్టం మేరకు ఏలూరు జిల్లాలో కలిపారు. ఉంగుటూరు నియోజకవర్గంలో ఉన్న గణపవరం మండలాన్ని పశ్చిమగోదావరి జిల్లాలో కలిపారు. ఇప్పుడు గణపవరాన్ని తిరిగి ఏలూరు జిల్లాలో కలుపుతారన్న ప్రచారంతో అక్కడి ప్రజలు తాము ఒప్పుకునేది లేదంటూ జిల్లాకు చెందిన మంత్రులను కలిసి వినతిపత్రాలు అందించిన పరిస్థితి నెలకొంది.

'పోలవరం' జిల్లా ఏర్పాటుపై ఉత్కంఠ

ఏజెన్సీ మండలాలన్నింటినీ కలిపి పోలవరం కేంద్రంగా జిల్లాను ఏర్పాటు చేస్తామని ఎన్నికల్లో చంద్రబాబు హామీ ఇచ్చారు. ఏజెన్సీ మండలాలను ప్రత్యేక జిల్లాగా చేస్తే అక్కడి ప్రజా సమస్యలపై ఎక్కువ దృష్టి పెరిగే అవకాశం ఉంటుంది. కుక్కునూరు, వేలేరుపాడు, పోలవరం మండలాల ప్రజలు జిల్లా కేంద్రం ఏలూరుకు రావాలంటే 120 కిలోమీటర్ల ప్రయాణం చేయాల్సి వస్తోంది. దీంతో జిల్లా కేంద్రానికి ఉదయం బయలుదేరితే తిరిగి వెళ్లేసరికి రాత్రి అవుతోంది. తూర్పుగోదావరి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఏజెన్సీ మండలాలను ప్రత్యేక జిల్లాగా చేస్తే కలెక్టర్‌తోపాటు, అధికారులంతా పూర్తిగా ఏజెన్సీ ప్రాంతంలోనే పనిచేసే అవకాశం ఉంటుంది. గిరిజనులు తమ సమస్యలను అధికారులకు చెప్పుకునే అవకాశం ఏర్పడుతుంది. దీంతో పాలనలో పారదర్శకత వచ్చే పరిస్థితి కొనసాగుతుంది. పోలవరం జిల్లా ఏర్పాటుపై ఏజెన్సీ ప్రజలు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం నియమించిన మంత్రులు కమిటీ పోలవరం జిల్లా ఏర్పాటు నివేదిక ఏవిధంగా ఇస్తుందోనన్న ఉత్కంఠ కొనసాగుతోంది.

అధికారుల సూచనల మేరకు యూరియా వినియోగించాలి


కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - కాళ్ల



గొడౌన్‌లో యూరియా బస్తాలను పరిశీలిస్తున్న కలెక్టర్

వ్యవసాయ అధికారుల సూచనల మేరకే యూరియా వినియోగించుకోవాలని రైతులకు జిల్లా కలెక్టర్ సి.నాగరాణి సూచించారు. కోపల్లె విశాల సహకార సొసైటీ బ్యాంకులో యూరియా వినియోగంపై రైతులకు అవగాహనా సదస్సు ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ వ్యవసాయ అధికారుల సూచనల మేరకే యూరియా వినియోగించుకోవాలని, రైతులకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా యూరియా అందిస్తున్నామని, ఏమైనా సమస్యలుంటే నేరుగా తమ దృషికి తీసుకురావాలని తెలిపారు. యూరియాను అధిక ధరలకు అమ్మొద్దని సూచించారు. జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ యూరియా అధికంగా వాడడం వల్ల ఎటువంటి ప్రయోజనమూ పంటకు కలుగదని, కేవలం మళ్లీ 20 శాతం మాత్రమే వినియోగించుకుంటుందని, మిగిలిన 80 శాతం ఆవిరి రూపంలో భూమి అడుగు భాగాలకు చేరిపోతుందని తెలిపారు. రైతులు గమనించి ఎరువుల వినియోగాన్ని క్రమంగా తగ్గించుకొని తద్వారా దిగుబడులు పెంచుకునే విధానాలపై సరైన అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రకృతి వ్యసాయంపై దృష్టి సారించాలన్నారు. ఎవరైనా ఎరువులను అధిక ధరలకు, నిల్వలు చేసిన వారిపై చర్యలు తీసుకొని లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమమలో జిల్లా వ్యవసాయ అధికారి జెడ్ వెంకటేశ్వర్లు, జిల్లా సహకార అధికారి మురళీకృష్ణ, ఆకివీడు వ్యవసాయశాఖ ఎడిఎ కె.జీవనప్రతాప్, కోపల్లె రూరల్ బ్యాంక్ ఛైర్మన్ నంద్యాల రామరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్‌సి గోపీమూర్తి

సమాజ అభివృద్ధిలో ప్రజలు భాగస్వామ్యం కావాలి

ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి గోపీమూర్తి

శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలి : యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు

ఘనంగా జన విజ్ఞాన వేదిక 18వ జిల్లా మహాసభ

ప్రజాశక్తి - భీమవరం

మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా శాస్త్రీయ దృక్పథంతో ఆలోచిస్తూ సమాజ అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి అన్నారు. స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా 18వ మహాసభ ఆదివారం నిర్వహించారు. సభకు జెవివి జిల్లా అధ్యక్షులు చింతపల్లి ప్రసాదరావు అధ్యక్షత వహించారు. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి జాతీయ పతాకాన్ని, జెవివి సీనియర్ నాయకులు ప్రత్తి వీరాస్వామి జెవివి పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గోపీమూర్తి మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక ప్రజల్లో దేశభక్తిని, విద్యార్థుల్లో సైన్స్ పట్ల అభిరుచిని పెంపొందించే కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాజ్యాంగంలో పొందుపర్చిన శాస్త్రీయ దృక్పథం ప్రజల్లో పెంపొందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ప్రభుత్వాలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా పాఠ్య పుస్తకాల్లోని కొన్ని సైన్సు విషయాలను తొలగించడాన్ని ఖండించారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.త్రిమూర్తులు రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 13, 14వ తేదీలో విజయనగరంలో జరిగే జన విజ్ఞాన వేదిక రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. జెవివి జిల్లా గౌరవాధ్యక్షులు డాక్టర్ కెఎస్‌పిఎన్.వర్మ మాట్లాడుతూ జెవివి విద్య, వైద్య రంగాల్లో ప్రముఖంగా పనిచేసి సమాజ మార్పునకు తోడ్పడాలన్నారు. అనంతరం జెవివి రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యదర్శి నివేదికను జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి జామాను రామలక్ష్మణరావు ప్రవేశపెట్టారు. ఆర్థిక నివేదికను జెవివి జిల్లా కోశాధికారి మల్లుల శ్రీనివాస్ ప్రవేశపెట్టారు. చెకుముకి జిల్లా కన్వీనర్ రేపాక వెంకన్నబాబు మాట్లాడుతూ ఏడాది జరిగే చెకుముకి సైన్సు సంబరాలను విజయవంతం చేయాలని కోరారు. ప్రజా నాట్యమండలి కళాకారులు చైతన్య ప్రసాద్ గీతాలను ఆలపించి అందర్నీ చైతన్య వంతులను చేశారు. ఈ కార్యక్రమంలో జెవివి సీనియర్ నాయకులు ప్రతి వీరాస్వామి, పిజికె గోఖలే, నంద్యాల భాస్కరరాజు, వై.అజయ్ కుమార్, కె.శ్రీదేవి, టి.వెంకటేశ్వరరావు, ఆర్.సత్యనారాయణ, కె.రాయపరాజు, పి.ఫణి రాజేష్, ఎ.లోకేశ్వరరావు, పి.శ్రీనివాసరాజు, చింతపల్లి ఉదయ్ కిరణ్, ఎంవిఎన్ఎల్‌బి సిహెచ్.కుమారి, జి.సుకుమార్, జి.కుమారస్వామి, పి.రామజ్యోతి, సిహెచ్.లక్ష్మీపతిరాజు, ఎస్.ప్రేమ రాజు, జె.రాంబాబు, వై.శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యారంగం, ఆర్థిక సమస్యలపై రణభేరి

15 నుంచి 19వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఐదు ప్రాంతాల్లో నిర్వహణ

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు

ఉపాధ్యాయులు స్వేచ్ఛగా పాఠాలు బోధించే అవకాశం కల్పించాలి : టీచర్స్ ఎంఎల్‌సి గోపీమూర్తి

ప్రజాశక్తి - భీమవరం




రణభేరి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నేతలు

విద్యారంగ, ఆర్థిక సమస్యలపై ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకూ రాష్ట్ర వ్యాప్తంగా ఐదు ప్రాంతాల్లో రణభేరి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయులు రణభేరిలో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. స్థానిక బిఆర్ అంబేద్కర్ భవనంలో యుటిఎఫ్ జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశం ప్రారంభ సూచికంగా వెంకటేశ్వర్లు జాతీయ పతాకాన్ని, యుటిఎఫ్ పూర్వపు రాష్ట్ర కార్యదర్శి సరిపల్లి జయప్రభ ఎస్‌టిఎఫ్ఐ పతాకాన్ని, పూర్వపు జిల్లా గౌరవాధ్యక్షులు మారెళ్ల మార్కండేయులు యుటిఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సమావేశానికి యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు అధ్యక్షత వహించారు. జిల్లా సహాధ్యక్షుడు ఫారం రాజశేఖర్ సమావేశానికి ఆహ్వానం పలికారు. గౌరవాధ్యక్షులు చెల్లుబోయిన పట్టాభిరామయ్య సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం కార్యకలాపాల నివేదికను ప్రవేశపెట్టారు. కోశాధికారి పోలిశెట్టి క్రాంతి కుమార్ ఆర్థిక నివేదికను ప్రవేశపెట్టారు. 15 నుంచి జరిగే రణభేరి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని 25న విజయవాడలో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రపంచ బ్యాంకు ఆదేశాలతో ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. పేద, బలహీన వర్గాల పిల్లలకు పాఠశాలలను దూరం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉభయగోదావరి జిల్లాల టీచర్ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి మాట్లాడుతూ ఉపాధ్యాయ దినోత్సవం రోజున ప్రభుత్వం ఉపాధ్యయులను గౌరవించి అదే తమ ఘనకార్యంగా చెప్పుకుంటోందని విమర్శించారు. ఉపాధ్యా యులకు స్వేచ్ఛగా తరగతి గదిలో పాఠాలు బోధించుకునే అవకాశాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు పి.శివప్రసాద్, ఎస్.రతనరాజు, డిజె.కుమార్, పి.కృష్ణకుమారి, డి.పద్మావతి, కె.బ్రహ్మయ్య, సిహెచ్. కుమార్‌బాబ్జి, ఎం.శ్రీనివాస్, కె.శ్రీరామకృష్ణ ప్రసాద్, కెఎస్‌సిహెచ్.సాయిరాం, డి.ఏసుబాబు, జి.లక్ష్మీనారాయణ, రాష్ట్ర కౌన్సిలర్లు జివివి.రామానుజరావు, ఎంవి.రాజశేఖర్, కేతా వెంకటేశ్వరరావు, బిజెవిడి.రాజ్యలక్ష్మి, బి.పిల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మెరుగైన సమాజ నిర్మాణానికి శ్రీరామ్మూర్తి కృషి

మెరుగైన సమాజ నిర్మాణానికి యుటిఎఫ్ వ్యవస్థాపక రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వలవల శ్రీరామ్మూర్తి ఎంతో కృషి చేశారని పలువురు వక్తలు కొనియాడారు. యుటిఎఫ్ మధ్యంతర కౌన్సిల్ సమావేశంలో శ్రీరామ్మూర్తి ప్రథమ వర్ధంతి సభను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ, ప్రజాసంఘాల నేతలు శ్రీరామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ శ్రీరామ్మూర్తి మెరుగైన సమాజ నిర్మాణం కోసం తన ఉపాధ్యాయ వృత్తిని సైతం వదిలి ప్రజా సంఘాల్లో పనిచేశారని గుర్తుచేశారు. శ్రీరామ్మూర్తి జీవితం ధన్యమైందని అన్నారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయడమే ఆయనకు ఇచ్చే ఘనమైన నివాళి అని కొనియాడారు.



శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్‌ఎ

వసతి గృహాల్లో సదుపాయాల కల్పనకు కృషి

ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ

తణుకు : వసతిగృహాల్లో విద్యార్థుల సదుపాయాలు మెరుగుపరిచి, కనీస సౌకర్యాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కృషిచేస్తోందని తణుకు ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. తణుకు 13వ వార్డులో ఎస్‌సి సంక్షేమ వసతిగృహం అభివృద్ధి పనులకు ఎంఎల్‌ఎ రాధాకృష్ణ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందుకు సంబంధించి తణుకు ఆంధ్ర షుగర్స్ యాజమాన్యం సిఎస్ఆర్ నిధులు రూ.25 లక్షలు మంజూరు చేయడం అభినందనీయమని అన్నారు. ఈ నిధులతో మరమ్మతులు, డైనింగ్ హాలు నిర్మాణం ప్రారంభించుకోవడం పట్ల ఆయన సంతోషం వ్యక్తంచేశారు. వర్షాలు కురిసినప్పుడు కింద నుంచి నీరు రావడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. దీంతోపాటు డైనింగ్ హాల్ పూర్తిస్థాయిలో శిథిలావస్థకు చేరిన దశలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి చొరవతో నిర్మాణ పనులు ప్రారంభించుకోవడం జరిగిందని చెప్పారు. జిల్లా అభివృద్ధిలో కలెక్టర్ నాగరాణి తనవంతు సహకారం అందిస్తున్నారని ఈ సందర్భంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నార్నిమెరక సొసైటీలో రూ.45 లక్షల నిధులు దుర్వినియోగం

సొసైటీ కార్యదర్శి చవ్వాకుల శ్రీనివాస్ సస్పెన్షన్

యలమంచిలి : మండలంలోని నార్నిమెరక సొసైటీ కార్యదర్శిగా పనిచేస్తున్న చవ్వాకుల శ్రీనివాస్ రూ.46.73 లక్షలు మేర నిధులను దుర్వినియోగం చేసినట్లు అధికారులు తేల్చినట్లు సొసైటీ ఛైర్మన్ డేగల సత్తికొండ తెలిపారు. దీనిలో రూ.35 లక్షలు ఇప్పటికే కార్యదర్శి నుండి రికవరీ చేసినట్లు, మిగిలిన రూ.11 లక్షల ముప్పై రెండు వేలను కూడా రికవరీ చేయడం జరుగుతుందని భీమవరం డిఆర్ఒ శ్రీనివాస్ ఆదేశాల మేరకు కార్యదర్శి చవ్వాకుల శ్రీనివాస్‌ను విధుల నుండి సస్పెన్షన్ చేసినట్లు తెలిపారు. ఇంకా విచారణ కొనసాగుతుందని, రైతులెవ్వరూ అధైర్య పడవలసిన అవసరం లేదని, సొసైటీని తిరిగి అభివృద్ధి పథంలో నడిపేందుకు, రైతులకు సేవలందించేందుకు నూతన త్రిసభ్య కమిటీ శక్తి వంచన లేకుండా కృషిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు పూరిళ్ల మాణిక్యాలరావు, ఏడిద నారాయణరావు, ఇన్‌ఛార్జి కార్యదర్శి పడాల వెంకట రమణ, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో ఎరువులు, యూరియా కొరత లేదు


జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - పెనుమంట్ర



రైతులతో మాట్లాడుతున్న జెసి రాహుల్‌కుమార్ రెడ్డి

జిల్లాలో ఎక్కడా కూడా ఎరువుల కొరత లేదని, ముఖ్యంగా యూరియా కొరత లేదని జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని జుత్తిగ పిఎసిఎస్‌లో ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు యూరియా గురించి ఆందోళన చెందవద్దని అక్కడి రైతులకు సూచించారు. అలాగే ఎరువులు, పురుగుమందులు అమ్మేటటువంటి డీలర్లు ఎంఆర్‌పికి మించి ఏవిధమైన ఎరువుల అమ్మకాలు చేయకూడదని ఎరువుల డీలర్లను ఆదేశించారు. ఎక్కడా కూడా ఎంఆర్‌పికు మించి గాని, అలాగే ఎరువుల కొరతను కృత్రిమంగా సృష్టిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్కడి రైతులతో ప్రత్యేకంగా సమావేశమై ప్రస్తుత ఖరీఫ్ సీజన్ గురించి ఆయన రైతులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఏవిధమైనటువంటి సమస్యలు ఉన్నట్లయితే నేరుగా వ్యవసాయాధికారులను సంప్రదించాలని తెలియజేశారు. ఇ-పంట నమోదు త్వరితగతిన పూర్తిచేయాలని, అందరి రైతుల వివరాలను ఇ పంటలో నమోదు చేసి ఏవిధమైనటువంటి ఇబ్బందులు లేకుండా చేయాలని వ్యవసాయ సహాయకులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నరసాపురం సబ్ కలెక్టర్ డి.రాజు, మార్టేరు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎంవి.రమేష్, మండల వ్యవసాయాధికారులు వై.రాఘవేంద్రరావు, బి.దేవి స్వరూప, మండల తహశీల్దార్ వై.రవికుమార్, సొసైటీ ఛైర్మన్ వీరవల్లి రాంబాబు, సొసైటీ రిజిస్ట్రార్ ముజిబుర్ రెహమాన్, గ్రామ రైతు నాయకులు, రైతులు, కౌలు రైతులు పాల్గొన్నారు.



ఎరువుల గిడ్డంగిని తనిఖీ చేస్తున్న జెసి

నేడు చించినాడలో కమ్యూనిస్టు యోధుడు ఆర్ఎస్ ప్రథమ వర్ధంతి సభ

హాజరుకానున్న రాష్ట్ర, జిల్లా నాయకులు

ప్రజాశక్తి - యలమంచిలి

కాకలు తీరిన కమ్యూనిస్టు యోధుడు, సిపిఎం ఉమ్మడి జిల్లా మాజీ రథసారథి, చించినాడ ముద్దుబిడ్డ రుద్రరాజు సత్యనారాయణ రాజు(ఆర్ఎస్) ప్రథమ వర్ధంతి సభ ఆయన స్వగ్రామమైన మండలంలోని చించినాడ సెంటర్‌లో ఉన్న అమరవీరుల స్థూపం వద్ద సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహిస్తున్నామని సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభలో ముఖ్య వ్యక్తులుగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం, సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం, సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కౌరు పెద్దిరాజు, ఆచంట మాజీ ఎంఎల్‌ఎ దిగుపాటి రాజగోపాల్, ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ, సిపిఎం సీనియర్ నేత కేతా సూర్యారావు, సిపిఎం మండల కార్యదర్శి బాలరాజు, సిపిఎం జిల్లా నేత బాతిరెడ్డి జార్జి హాజరుకానున్నారన్నారు. ఈ వర్ధంతి సభలో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

అమెరికా సుంకాలు ఉపసంహరించుకోవాలి

సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న సిపిఎం, సిపిఐ నేతలు

తణుకు : భారత్‌పై అమెరికా వేసిన సుంకాలు వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పివి.ప్రతాప్, సిపిఐ, సిపిఎం పట్టణ కార్యదర్శులు బొద్దాని నాగరాజు, అడ్డగర్ల అజయకుమారి అన్నారు. ఆదివారం స్థానిక నరేంద్ర సెంటర్ లో సిపిఐ, సిపిఎం పార్టీల ఆధ్వర్యంలో అమెరికా భారత్‌పై సుంకాలు వేయడాన్ని ప్లే కార్డులతో ప్రదర్శిస్తూ ధర్నా నిర్వహించారు. భారత్‌పై అమెరికా వేసిన సుంకాలు రద్దు చేయాలని, అమెరికన్ సామ్రాజ్యవాదం నశించాలని, అమెరికాలో ఉన్న భారతీయులపై ట్రంప్ కక్షసాధింపు చర్యలు ఆపాలని పెద్దత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్, నాగరాజు, అజయ కుమారిలు మాట్లాడుతూ అమెరికా భారతదేశంపై 50 శాతం సుంకాలు వేయడం అన్యాయమన్నారు. పెరిగిన సుంకాల వల్ల భారత్ దేశం నుండి జరుగుతున్న ఎగుమతులు నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. భారతదేశంపై ట్రంప్ నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నా మోడీ స్పందించకపోవడం బాధాకరమన్నారు. అమెరికా తన వద్ద ఉన్న ఆయుధాలు అమ్ముకోవడం కోసమే యుద్ధాలు ప్రేరేపిస్తుందన్నారు. ట్రంప్ సుంకాల పేరుతో భారత దేశాన్ని బెదిరించడం కోసం ప్రయత్నం చేస్తున్నా మోడీ ఒక్కమాట కూడా ఎందుకు మాట్లాడడం లేదని విమర్శించారు. రష్యా నుండి అమెరికాయిల్ కొనుగోలు చేయవచ్చు, భారత్ మాత్రం కొనకూడదు అనడం విడ్డురంగా ఉనందని పేర్కొన్నారు. భారత్ ఆర్థిక వ్యవస్థని నాశనం చేయడానికి అమెరికా ప్రయత్నం చేస్తుందని, ఈ ప్రమాదం నుండి రష్యా, చైనా కలిసి వచ్చే దేశాలతో ముందికు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం, సిపిఐ నాయకులు గార రంగారావు, పుట్ట అమ్మిరాజు, బొద్దాని మురళీ, బి.కిషోర్, బళ్ల చినవీరభద్రం, కె.నాగరత్నం, వల్లూరి వెంకటేశ్వరావు, టి.వెంకటేశ్వరావు, నూనె రాధాకృష్ణ, ఎం.రమేష్, భాస్కరరావు పాల్గొన్నారు.

సాగరతీరం కోలాహలం

ప్రజాశక్తి - మొగల్తూరు



సాగరతీరంలో పర్యాటకులు

మండలంలోని పేరుపాలెం సౌత్, కేపీ పాలెం సౌత్ గ్రామాల్లో విస్తరించి ఉన్న బీచ్ ఆదివారం పర్యాటకులతో సందడి నెలకొంది. పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు ప్రత్యేక ద్విచక్ర వాహనాలలో బీచ్‌కు ఉదయమే చేరుకున్నారు. పలువురు సముద్ర కెరటాలలో స్నానాలు చేశారు. చిన్నారులు ఒడ్డుకు కొట్టుకు వస్తున్న కెరటాలతో, ఇసుక తిన్నెలపై ఆటలాడుకున్నారు. ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని సరివి, కొబ్బరి తోటలలో సహపంతి భోజనాలు చేసి సేద తీరారు.



రోగులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సిహెచ్.నాగరాణి

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ప్రభుత్వాసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. ఆదివారం భీమవరం ప్రభుత్వాసుపత్రిని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని పలు వార్డులను సందర్శించి, రోగులతో స్వయంగా మాట్లాడి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్య సేవలు ఎలా అందిస్తున్నారు, మీ పట్ల మర్యాదగా వ్యవహరిస్తున్నారా, ఎవరైనా డబ్బులు అడుగుతున్నారా, రక్త పరీక్షలు ఇక్కడే చేస్తున్నారా అని పలు ప్రశ్నలు వేసి వివరాలను అడిగి తెలుసుకున్నారు. చికిత్స పొందుతున్న వారు ఆసుపత్రి సేవల పట్ల సంతృప్తిని వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వైద్యులను అభినందిస్తూ ప్రభుత్వాసుపత్రికి పేద, మధ్యతరగతి ప్రజలు వైద్యానికి వస్తారని, వారిని మర్యాదతో పలకరించడంతోపాటు, మంచి సేవలు అందించాలని సూచించారు. జిల్లాలో ప్రభుత్వాసుపత్రుల్లో అందుతున్న వైద్య సేవల్లో మీ అందరి కృషివల్ల రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో ఉన్నామని, ఇదే స్ఫూర్తిని ఇకముందు కూడా కొనసాగించేలా మరింత మెరుగైన సేవలను ప్రజలకు అందించాలని తెలిపారు. ఆసుపత్రి సందర్శన సమయంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ లక్ష్మణ్ గీతానంద్, ఆర్ఎంఒ డాక్టర్ కె.ప్రవీణ్ కుమార్, డాక్టర్ సుబ్బలక్ష్మి, డాక్టర్ పద్మ ఉన్నారు.

ఉపాధి కార్మికులకు వేతనాలు చెల్లించాలి

వ్యకాస మండల కార్యదర్శి మోడీ మోజెస్

ప్రజాశక్తి - పోడూరు

కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ కార్మికుల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం పోడూరు మండల కార్యదర్శి మోడీ మోజెష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని జగన్నాధపురం గ్రామంలో కె.లక్ష్మి అధ్యక్షతన వ్యవసాయ కార్మిక సంఘం గ్రామసభ ఆదివారం నిర్వహించారు. ఈ సభలో మోజెష్ మాట్లాడుతూ ఉపాధి కూలీలకు పనులు లేక జీవనోపాధి కుంటుపడిందని ఆవేదన వ్యక్తంచేశారు. కార్మికులకు పని కల్పించి వేతనాలు ఇవ్వాలన్నారు. పని సమయంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వేతనాలు పెంచి సకాలంలో చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెవి సుధా, కె.జ్యోతి పార్వతి, కొర్ల లక్ష్మి, కె.నాగరాజు, కె.సరస్వతి, పి.పార్వతి, పి.లక్ష్మి, కె.లక్ష్మి, కె.వెంకటేశ్వర్లు, సుహాసిని, ఎ.నాగలక్ష్మి పాల్గొన్నారు.

నేడు కౌలురైతు సంఘం జిల్లా మహాసభ

ప్రజాశక్తి - గణపవరం

ఆంధ్రప్రదేశ్ కౌలురైతు సంఘం జిల్లా నాలుగో మహాసభ పోడూరు మండలం కవిటం గ్రామంలో మేడపాటి పరుశ రామిరెడ్డి కళ్యాణ మండపంలో సోమవారం జరుగుతుందని కౌలురైతు సంఘం జిల్లా సహాయకార్యదర్శి పెచ్చెట్టి నరశింహమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడేళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు, కౌలురైతులకు దెబ్బతీసే విధానాలపై మహాసభలో చర్చించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కౌలురైతులు ఎదుర్కొంటున్న గుర్తింపు కార్డులు, బ్యాంకు రుణాలు, పంట నమోదు, పంట నష్టం, పంటకు పెట్టుబడులు, మురుగు పంట కాలవులు వంటి సమస్యలపై మహాసభలో చర్చలు జరుగుతాయని చెప్పారు. మహాసభలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు హాజరవుతున్నట్లు తెలిపారు. జిల్లాలోని కౌలురైతులందరూ మహాసభలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

గంజాయి మత్తులో మహిళలపై అసభ్య ప్రవర్తన

ఆందోళనకు దిగిన పలువురు మహిళలు

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని వీవర్స్ కాలనీలో ఆలయం వద్ద వినాయక నిమజ్జనోత్సవంలో ఇద్దరు యువకులు గంజాయి మత్తులో మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పలువురు మహిళలు ఆందోళనకు దిగారు. దీంతో నరసాపురంలో శనివారం అర్ధరాత్రి ఉద్రిక్తత చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న సిఐ బి.యాదగిరి, ఎస్ఐ సిహెచ్.జయలక్ష్మి సంఘటనా ప్రాంతానికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడినా పట్టు వీడలేదు. దీంతో నరసాపురం డిఎస్పి డాక్టర్ జి.శ్రీవేద అక్కడకు వచ్చి వారితో మాట్లాడారు. రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థినులను సామాజిక మాధ్యమాల్లో వేధిస్తున్న వారిపై కూడా చర్యలు తీసుకుంటామని, ఆ ప్రాంతంలో నిఘాకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళనకారులు శాంతించి విరమించారు. ఇరువురి యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆ ప్రాంతంలో అర్ధరాత్రి డ్రోన్ కెమెరాతో అక్కడ పరిస్థితులను నమోదు చేశారు. పోలీసులతో గస్తీ ఏర్పాటు చేశారు.

సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - పాలకొల్లు

వైసిపి ఐదేళ్ల పాలనలో సిఎం సహాయ నిధిని రద్దుచేయగా, చంద్రబాబు మానవత్వంతో పునరుద్ధరించారని మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. పాలకొల్లు నియోజకవర్గంలో 53 మందికి సిఎం సహాయ నిధి నుంచి రూ.25 లక్షల చెక్కులను మంత్రి ఆదివారం మంత్రి కార్యాలయం వద్ద అందించారు. రాష్ట్రంలో మంచి పాలన అందిస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. చంద్రబాబు ఏడాది పాలన పట్ల అన్ని తరగతుల ప్రజలు సంతృప్తి, సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. జగన్ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చిన్నాభిన్నం చేసి, అప్పుల పాలు చేశారని చెప్పారు. రాష్ట్ర విభజన నష్టం కన్నా, జగన్ ఐదేళ్ల పాలనలోనే ఎక్కువ నష్టం జరిగిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేశామన్నారు. రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.20 వేలు అమలు చేస్తున్నామన్నారు. పెన్షన్ సొమ్ము పెంపు, మహిళలకు ఉచిత ప్రయాణం, తల్లికి వందనం కింద ప్రతి విద్యార్థికి రూ.13 వేలు అందించినట్లు చెప్పారు. డిఎస్సి ద్వారా 16 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. అన్నా క్యాంటీన్ల పునరుద్ధరణ, గుంతలు లేని రోడ్లు, మత్స్యకారులకు వేట నిషేధ సాయంగా రూ.20 వేలు వంటివి అమలు చేసినట్లు చెప్పారు. కూటమి నేతలు పాల్గొన్నారు.

సుజాత సేవలు అభినందనీయం

జన్మదిన వేడుకల్లో ఎంఎల్ఎ రాధాకృష్ణ

ప్రజాశక్తి - తణుకు

స్వర్ణ లయన్స్‌క్లబ్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్న చిట్టూరి సుజాత సేవా దృక్పథాన్ని ప్రతిఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ప్రముఖ సామాజికవేత్త చిట్టూరి సుజాత జన్మదిన వేడుకల్లో ఎంఎల్ఎ రాధాకృష్ణ పాల్గొని మాట్లాడుతూ ఎంతో మంది విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేయడంతోపాటు చిరువ్యాపారులకు అండగా పలు సేవా కార్యక్రమాలు చేస్తున్న సుజాత మానవత సేవా సంస్థకు రూ.3 లక్షలు అందజేయడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో తణుకు ప్రాంతంలో మరిన్ని సేవా కార్యక్రమాలు విస్తృతం చేయాలని ఎంఎల్ఎ రాధాకృష్ణ కోరారు. ఈ కార్యక్రమంలో స్వర్ణ లయన్స్ క్లబ్, మానవత స్వచ్ఛంధ సేవా సంస్థ సభ్యులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

డాక్టర్ రంగం నాయుడు

చిట్ - చాట్

ప్రజాశక్తి - కాళ్ల

ప్రస్తుత వాతావరణ మార్పులతో కాలానుగుణ వ్యాధుల నుంచి ముప్పు పొంచి ఉందని, ప్రతి ఒక్కరూ శుభ్రతా చర్యలు పాటించాలని కాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సిహెచ్‌వి.రంగం నాయుడు సూచించారు. దోమలు వ్యాపించి జ్వరాలు వచ్చే వీలున్నందున ఏమాత్రం అశ్రద్ధ చేయకుండా సమీపంలోని ప్రాథమిక, ఆరోగ్య ఉప కేంద్రాలను సంప్రదించాలన్నారు. జలుబు, దగ్గు లాంటి సమస్యలు తలెత్తినా నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని చెప్పారు. కాళ్ల పిహెచ్‌సి పరిధిలోని ప్రభుత్వాసుపత్రుల్లో అందుతున్న సేవలు, ప్రస్తుతం కాలానుగుణంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజాశక్తికి ఇచ్చిన చిట్-చాట్‌లో పలు విషయాలు ఆయన వెల్లడించారు.

ప్రశ్న : వైద్యశాలల్లో ప్రతి రోజు ఒపి ఎంత?

వైద్యులు : వైద్యశాలల్లో ఒపి సంఖ్య 60కు పైగా నమోదవుతోంది.

ప్రశ్న : జ్వరం లక్షణాలు కనిపిస్తే ఏం చేయాలి?

వైద్యులు : ప్రస్తుతం వాతావరణంలో మార్పులు వచ్చాయి. జ్వరాలు వస్తే ఎవరూ అశ్రద్ధ చేయవద్దు. రెండు రోజులకు మించి ఉంటే వెంటనే దగ్గరలోని వైద్యశాలకు వెళ్లి చూపించుకోవాలి. సామాజిక ఆరోగ్య కేంద్రాలు, పిహెచ్‌సిల్లో ఉచితంగా మందులు ఇస్తారు.



ప్రశ్న : ఆసుపత్రుల్లో సిబ్బంది కొరత ఉందా? 24 గంటలు పని చేస్తున్నాయా?

వైద్యులు : కాళ్ల పిహెచ్‌సి 24 గంటలూ పనిచేస్తుంది. వైద్యులు అందుబాటులో ఉంటారు.

ప్రశ్న : ప్రస్తుత సీజన్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటి?

వైద్యులు : ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలి. మురుగునీటి నిల్వలు, అపరిశుభ్రత ఉన్న ప్రదేశాల్లో దోమలు వృద్ధి చెందుతాయి. రాత్రి సమయంలో దోమ తెరలను వినియోగించాలి. అతి చల్లని నీటిని తాగకూడదు. శీతల పానీయాలు, ఐస్‌క్రీములకు దూరంగా ఉండాలి. వేడి ఆహారాన్ని తీసుకోవాలి. ఆహారాన్ని ఫ్రిజ్‌లో దాచి తర్వాతి రోజు తినకూడదు. శుద్ధి చేసిన నీటినే తాగాలి. ముందస్తు జాగ్రత్తగా జ్వరాలను అరికట్టేందుకు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. మురుగునీరు, నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమలు వృద్ధి చెందకుండా ఎబేట్ ద్రావణాన్ని పిచికారీ చేయిస్తున్నాం. ఫాగింగ్ ద్వారా దోమలు అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నాం.

ప్రశ్న : వర్షపు నీరు నిల్వ ఉండకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు?

వైద్యులు : నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి. నీటి పాత్రలపై మూతలు ఉంచాలి. వర్షాకాలం కావడంతో కొత్త నీటిలో మలేరియా, డెంగీ కారక దోమలు ఉంటాయి. ఆ నీటిని కాచి చల్లార్చి తాగాలి. చిన్నపిల్లల పట్ల తల్లిదండ్రులు మరింత జాగ్రత్త వహించాలి.




ర్యాలీ చేస్తున్న విద్యాశాఖ అధికారులు

బడిఈడు పిల్లలందరూ చదువుకోవాలి

సార్వత్రిక విద్యాపీఠం ర్యాలీలో ఎంఇఒ రాజేష్

ప్రజాశక్తి - గణపవరం

బడిమానేసిన పిల్లలందరూ మరలా విద్య నేర్చుకోవటానికి వీలుగా ప్రభుత్వ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా విద్య నేర్చుకోవచ్చని ఎంఇఒ ఎస్.రాజేష్ అన్నారు. విద్యాశాఖ ఆధ్వర్యాన ఆదివారం గణపవరంలో సార్వత్రిక విద్యాపీఠం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గణపవరం ఎంఇఒ రాజేష్ మాట్లాడుతూ విద్య నేర్చుకుంటే కలిగే లాభాలు స్థానికులకు వివరించారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులు చదువుకోవటానికి వీలుగా పదవతరగతి, ఇంటర్ మీడియట్ విద్యార్థులు 25-26 సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభించినట్లు చెప్పారు. స్కూల్స్‌లో డ్రాప్ అవుట్స్ లేకుండా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులను కోరారు. తల్లిదండ్రులు తమ పిల్లలను మరలా చదువుకోవటం కోసం ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెండవ విద్యాశాఖాధికారి జి.బాలయ్య, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు జి.వీరవేణి, ఒకటవ నెంబర్ పాఠశాల హెచ్ఎం నారాయణ, హైస్కూల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



సత్యనారాయణను అభినందిస్తున్న నేతలు

ఇల్లపర్రు సొసైటీ అధ్యక్షుడిగా సత్యనారాయణ

ప్రజాశక్తి - పెనుగొండ రూరల్

ఇల్లపర్రు గ్రామ సహకార సంఘం(సొసైటీ) అధ్యక్షుడిగా కేత సత్యనారాయణ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి కూటమి నాయకులు, జనసైనికులు, రైతులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై శుభాకాంక్షలు తెలియజేశారు. కేత సత్యనారాయణ మాట్లాడుతూ ఆచంట నియోజకవర్గ ఎంఎల్ఎ పితాని సత్యనారాయణకి కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకానికి తగ్గట్టు గ్రామాభివృద్ధి, రైతుల సంక్షేమం, రుణ సౌకర్యాలు-మార్కెట్ లింకేజీలు, పారదర్శక పరిపాలనకు ప్రాధాన్యం ఇస్తానన్నారు. ఈ సందర్భంగా వక్తలు సత్యనారాయణపై నమ్మకం వ్యక్తం చేస్తూ మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. గ్రామ పెద్దలు, మహిళా సంఘ ప్రతినిధులు, యువ నాయకులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు.



రాజరాజేశ్వరిని సత్కరిస్తున్న సంస్థ నిర్వాహకులు

డాక్టర్ రాజరాజేశ్వరికి గురుబ్రహ్మ అవార్డు

పాలకొల్లు : స్థానిక శ్రీఅద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ తిరువీధుల రాజరాజేశ్వరి గురుబ్రహ్మ అవార్డు అందుకున్నారు. విశాఖపట్నానికి చెందిన ప్రముఖ సేవాసంస్థ మదర్ థెరిస్సా సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటుచేసిన పురస్కార మహోత్సవ కార్యక్రమంలో ఆ సంస్థ కార్యనిర్వాహక సభ్యులు, విజయవాడ నగర ప్రముఖుల చేతులమీదగా రాజరాజేశ్వరి ఈ అవార్డును అందుకున్నారు. సామాజిక సేవా కార్యక్రమాలు, విద్యారంగంలో విశేషంగా కృషిచేసిన వారికి ప్రతి సంవత్సరం గురుబ్రహ్మ అవార్డుతో సత్కరిస్తుంటామని మదర్ థెరిస్సా సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ నిర్వాహకులు తెలియజేశారు. గురుబ్రహ్మ అవార్డు అందుకున్న కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజరాజేశ్వరికి కాలేజీ డెవలప్ మెంట్ కౌన్సిల్ సెక్రటరీ డాక్టర్ వీరరాఘవయ్య, కళాశాల వైస్ ప్రిన్సిపల్ టి.కృష్ణ, సిబ్బంది, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

రూ.లక్షా 45 వేలు పలికిన గణపతి లడ్డూ

ఆచంట: మండలంలోని కరుగోరుమిల్లి గ్రామ శివారు ముత్యాలవారిపాలెం శ్రీభక్తాంజనేయ కోదండ రామాలయంలో 13వ శ్రీవిజయ గణపతి నవరాత్రి మహోత్సవాలు శ్రీరామ రాయల్ యూత్ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ మహోత్సవంలో స్వామి వారి లడ్డూ ప్రసాదంను కరుగోరుమిల్లి గ్రామానికి చెందిన ముత్యాల సత్యనారాయణ, మాసేనమ్మ దంపతుల కుమారులు రూ.లక్ష 45 వేలకు దక్కించుకున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. అనంతరం భారీ అన్న సమారాధన కార్యక్రమం చేపట్టారు.

అసంపూర్తిగా సామాజిక భవనం

నిర్మాణం పూర్తిచేసి అందుబాటులోకి తేవాలని ప్రజలు వేడుకోలు



రామన్నపాలెంలో అసంపూర్తిగా ఉన్న సామాజిక భవనం

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని రామన్నపాలెంలో సుమారు రూ.35 లక్షలతో చేపట్టిన సామాజిక భవనం అసంపూర్తిగా నిలిచిపోయింది. దీంతో నిరుపయోగంగా మారింది. గత టిడిపి ప్రభుత్వంలో సుమారు ఏడు సంవత్సరాల కిందట రూ.35 లక్షలు వెచ్చించి సామాజిక భవన నిర్మాణం చేపట్టారు. ఆ భవన నిర్మాణాన్ని పూర్తి చేయలేదు. తర్వాత వచ్చిన వైసిపి కూడా దృష్టి పెట్టకపోవడంతో నేటికీ అసంపూర్తిగానే మిగిలిపోయింది. ప్రస్తుతమున్న కూటమి ప్రభుత్వమైనా భవనాన్ని పూర్తి చేస్తే ఆ ప్రాంతంలో సుమారు 500 మంది ప్రజలకు శుభ, పలు కార్యక్రమాలకు వినియోగించుకునేందుకు వీలుండేది. నిర్మాణం చేయకపోవడంతో నిరుపయోగంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి భవన నిర్మాణం పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

సిఐటియు మండల కన్వీనర్‌గా రంగారావు



కన్వీనర్ రంగారావు



కోకన్వీనర్ విజయలక్ష్మి

ప్రజాశక్తి - ఆచంట

సిఐటియు మండల ఐదో మహాసభలో 14 మంది సభ్యులతో మండల నూతన సమన్వయ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మహాసభలో మండల కన్వీనర్‌గా బండి రంగారావు, కో కన్వీనర్‌గా నేలపాటి విజయలక్ష్మి ఎన్నికయ్యారు. సభ్యులుగా గుత్తుల శ్రీదేవి, సుష్మ, మట్టపర్తి నాగమణి, కోమటి నాగలక్ష్మి, చిలుకూరి వరలక్ష్మి, బొక్క ఝాన్సీ, రాఘవ పుష్పావతి, బోళ్ల ఆదిలక్ష్మి, యండ్ర దుర్గారావు, ఎర్రగుప్పల బాలాజీ, పూసల ఏడుకొండలు, కేతా నాగాంజనేయులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జరిగిన మండల మహాసభలో నూతనంగా ఎన్నికైన కన్వీనర్ రంగారావు మాట్లాడుతూ అన్ని రంగాల్లోను కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై సిఐటియు అలుపెరగని పోరాటం చేస్తుందన్నారు. సిఐటియు యూనియన్ అనేక కార్మిక యూనియన్లకు అండగా నిలిచి కార్మికుల సమస్యలపై పోరాటం చేస్తుందన్నారు. సిఐటియు అండతో పోరాటాలు చేసి కార్మికుల సమస్యలను పరిష్కరించుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం అనేక కార్మిక చట్టాలను మార్పు చేసిందని, ఆ చట్టాలను సాధించుకోవాలంటే సిఐటియు యూనియన్ పోరాటాలతో సాధ్యపడుతుందని ఆయన అన్నారు.



సిఐటియు మండల కమిటీ సభ్యులు

ఎన్‌కె మాస్టారుకు గుర్రం జాషువా అవార్డు



అవార్డు అందుకుంటున్న విశ్రాంత ఉపాధ్యాయులు ఎన్‌కె మాస్టార్

ప్రజాశక్తి - పెనుమంట్ర

ప్రముఖ కవి, రచయిత, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఎన్‌కె.నాగేశ్వరరావుకు మహాకవి గుర్రం జాషువా శత జయంతి సందర్భంగా అవార్డు ప్రధానం చేశారు. ఆదివారం భీమవరంలోని మెయిన్ గ్రంథాలయం వేదికపైన జరిగిన రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యాన ఉషోదయ ఫౌండేషన్ నిర్వహించిన గుర్రం జాషువా శత జయంతి వేడుకల్లో ఈ అవార్డు అందించారు. గడచిన ఐదు వసంతాలుగా తెలుగు సాహిత్యానికి నాగేశ్వరరావు మాస్టారు చేసిన సేవలకు గాను ఈ ప్రతిష్టాత్మక పురస్కారం ఇస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు యువి.రత్నం, డాక్టర్ ధనాని ఉషారాణి అన్నారు. తన సాహితీ జీవితంలో నాగేశ్వరరావు మాస్టారు ప్రసిద్ధ సాహితీ వేత్తలు గురజాడ, శ్రీశ్రీ, పానుగంటి, చిలకమర్తి, అల్లూరి సీతారామరాజు సహచరులు పడాల రామారావు తదితర అవార్డ్సు అందుకున్నారు. గుర్రం జాషువా అవార్డు పొందిన వీరిని పలువురు సాహితీ వేత్తలు, విద్యారంగ ప్రముఖులు అభినందించారు.

నూతన సాంకేతిక విధానంతో ఖర్చు తగ్గు

ప్రకృతి వ్యవసాయం నరసాపురం డివిజన్ ఇన్‌ఛార్జి నరసింహారావు

ప్రజాశక్తి - మొగల్తూరు

నూతన సాంకేతిక విధానంతో రైతులకు ఖర్చులు తగ్గుతాయని ప్రకృతి వ్యవసాయం నరసాపురం డివిజన్ ఇన్‌ఛార్జి నరసింహారావు సూచించారు. ఆదివారం మొగల్తూరు పంచాయతీ కోట ప్రాంతం కుక్కలవారి తోటలోని గ్రామ సంఘాల ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు డ్రోన్‌తో పిచికారీ చేసే విధానాన్ని నరసింహారావు వివరించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. వరిచేనులపై కోడిగుడ్డు, నిమ్మరసం, కషాయం, 12 రకాల బ్యాక్టీరియాలు కలిపి పిచికారీ చేయడం వల్ల పంట పెరుగుదల బాగా ఉంటుందన్నారు. వరిలో వచ్చే అన్నిరకాల తెగులను ట్రైకోడెర్మావిరిడి, సుడోమనస్ పిచికానీ చేసి నివారించవచ్చని రైతులకు తెలిపారు. 15 మంది రైతులు 30 ఎకరాలు సామూహికంగా డ్రోన్ ద్వారా స్ప్రే చేశారు. దీంతో పలువురు రైతులు ఈ విధానంపై ఆసక్తి చూపారు. ఈ విధానంతో తమ చేలు కూడా పిచికారీ చేయాలని రైతులు కోరడంతో మంగళ, బుధవారాలలో తమ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ రైతులు కె.మహాలక్ష్మి, జి.కనకదుర్గ భవాని, ఎం.దుర్గ భవాని, యు.రామలక్ష్మి, పలువురు రైతులు ఉన్నారు.



డ్రోన్‌తో పిచికారీ విధానాన్ని రైతులకు వివరిస్తున్న నరసింహారావు

మార్కెట్లోకి కెటిఎం 160 డ్యూక్ బైక్

భీమవరం టౌన్ : వరుణ్ మోటార్స్ ప్రయివేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో సరికొత్త కెటిఎం 160 డ్యూక్ బైక్‌ను భీమవరంలోని వరుణ్ మోటార్స్ షోరూంలో సిఇఒ ఎ.శ్రీనివాస్, జనరల్ మేనేజర్ సురేష్, బి.సూర్యప్రకాష్ ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత అభిరుచి కనుగుణంగా ఈ బైకును రూపొందించడం జరిగిందన్నారు. ఇది కెటిఎం నుండి అత్యంత నూతన మోడల్ ఎంట్రీ లెవెల్ బైక్ అన్నారు. లిక్విడ్ కూల్డ్ 4 స్ట్రోక్, సింగిల్ సిలిండర్, ఇంటర్నల్ కాంబిషన్ కలిగి ఉన్న ఈ కొత్త మోడల్ అందరిని ఆకట్టుకుంటుందని అన్నారు. ఇంధన సామర్థ్యం 10.1 లీటర్లు అన్నారు. ట్యూబ్ లెస్ 17 అంగుళాల అల్లాయ్ వీల్స్, ఎల్ఇడి హెడ్ లైట్స్ ప్రత్యేకత అన్నారు. ఎక్స్ షోరూం ధర సుమారు రూ.1.85 లక్షలు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సేల్స్ మేనేజర్ ఎ.గోపీచంద్, బ్రాంచి మేనేజర్ బి.శివాజీ, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

ఫొటో, వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని ఫణి ఫంక్షన్ హాల్లో ఆదివారం పశ్చిమగోదావరి జిల్లా ఫొటో, వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రమాణస్వీకార మహోత్సవం ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షులుగా కెఎస్ఎస్.మూర్తి(క్యాపిటల్ రాజు) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వర్కింగ్ అధ్యక్షులుగా గోపిశెట్టి కృష్ణారావు, ఉపాధ్యక్షులుగా లక్కు శేషు, మద్దాల ఏసు ప్రసాద్, జాయింట్ కార్యదర్శిగా డి.ఏసురాజు, కోశాధికారిగా పెచ్చెటి సూర్యచంద్రరావు, జాయింట్ ట్రెజరర్‌గా, పి.ధనేష్‌కుమార్లు ఎన్నుకున్నారు. వీరి చేత రాష్ట్ర సంక్షేమ సంఘం ఛైర్మన్ మద్దాల రమేష్ ప్రమాణస్వీకారం చేయించారు. ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్, డిఎస్పి డాక్టర్ జి.శ్రీవేద, సిఐ బి.యాదగిరి అభినందించారు. కార్యక్రమంలో మైలాబత్తుల ఉమా, జి.శ్రీరామచంద్రమూర్తి, ఆకుల సందీప్, కోట్ల బాలకృష్ణ, ఇంటి పండు, వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

14 వరకూ బార్ కేటాయింపులకు దరఖాస్తులు

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం పట్టణ పరిధిలో 2025 నుంచి 2028 వరకూ బార్ల ద్వారా మద్యం అమ్మకాలు చేసుకునేందుకు ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగా విధివిధానాలు ఖరారయ్యాయని ఎక్సైజ్ సిఐ ఎస్.రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని రెండు బార్ అండ్ రెస్టారెంట్ కేటాయించారని తెలిపారు. ఈనెల 14వ తేదీ సాయంత్రం 6 గంటలు వరకూ గడువు ఉందని తెలిపారు. భీమవరం కలెక్టరేట్‌లో లాటరీ ద్వారా బార్లను కేటాయిస్తామని తెలిపారు. ఆసక్తి గలవారు రూ.5 లక్షల రుసుం చెల్లించి దరఖాస్తు ఆన్‌లైన్ ద్వారా లేదా ఆఫ్ లైన్‌లో చెల్లించాలని పేర్కొన్నారు.

ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి - పెనుగొండ

ఉభయగోదావరి జిల్లాలో ప్రతిభ కలిగిన 10వ తరగతి నుండి ఇంటర్ వరకు 90 శాతం మెరిట్, డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేట్లో 75 శాతం మెరిట్ కలిగిన విద్యార్థులకు ఈ ట్రస్ట్ ద్వారా మొదటిసారి ప్రతిభా పురస్కారాలను అందజేస్తున్నట్లు వాసవీ ట్రస్ట్ ఉపాధ్యక్షులు బొండాడ రాంపండు తెలిపారు. అఖిలభారత వాసవి పెనుగొండ ట్రస్ట్ ఉపాధ్యక్షుడు బొండాడ రాంపండు ఆదివారం విలేకరుల సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రస్ట్ అధ్యక్షులు పిఎన్.గోవిందరాజులు ఆదేశాల మేరకు అర్హత కలిగి ఉన్నవారు ఈనెల 15 లోపు పెనుగొండ వాసవీ ధామ్‌లో రిజిస్టర్ చేసుకోవచ్చని, 9912018818, 08819 - 246252 నెంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి కెఎస్‌వి.రాజా, కోట్ల సూర్యనారాయణ, కోట్ల కృష్ణారావు, నార్కెడిమిల్లి జనార్దన్‌రావు, ఎన్ఎస్ శ్రీనివాస్ మూర్తి, ఎస్.సతీష్ పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో వాసవీ క్లబ్ ముందంజ

ప్రజాశక్తి - పాలకొల్లు

వాసవీ మాతా ఆశీస్సులతో వాసవీ క్లబ్‌లు రాష్ట్ర వ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వాసవీ క్లబ్ అంతర్జాతీయ ఉపాధ్యక్షులు మాటూరి నర్సింహమూర్తి చెప్పారు. పాలకొల్లు వాసవీ డైమండ్ క్లబ్ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం గామాస్ కల్యాణ మండపంలో సీనియర్ జర్నలిస్ట్‌లకు సత్కారం చేశారు. నిత్యం వార్తా సేకరణలో ఎంతో కష్టపడి సాహసంతో వార్తలు ఇస్తారని చెప్పారు. పిటి వెంకటేశ్వరరావు, మండెల అప్పలరాజు, జి.సత్యనారాయణలను సత్కరించారు. అన్ని సెక్షన్లలో తయారైన పేపర్ తెల్లవారుజామున పాఠకులకు ఇచ్చే ఇరువురు పేపర్ బాయ్‌లను సత్కరించారు. ఇంకా క్లబ్ అధ్యక్షులు ఆరిశెట్టి రాంజీ, కార్యదర్శి గాదె సాయి, గాదె గుప్తా, మాటూరి వాసుదేవ గుప్తా పాల్గొన్నారు.

బండి ముత్యాలమ్మ సన్నిధిలో యాత్రికులు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో ఉన్న బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం యాత్రికులతో సందడి నెలకొంది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో బండి ముత్యాలమ్మ భజన సంఘం సభ్యులు ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి. ఆలయ కార్యనిర్వాహణాధికారి మోక అరుణ్ కుమార్, ఛైర్మన్ కడలి మాణిక్యాలరావు పర్యవేక్షణలో సిబ్బంది పాలకవర్గ సభ్యులు యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రసాద వితరణ తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు. చంద్రగ్రహణం సందర్భంగా సాయంత్రం ఐదు గంటల నుండి దర్శనాలు నిలిపివేశామని ఆలయ కార్యనిర్వాహణాధికారి మోకా అరుణ్ కుమార్ తెలిపారు. మరుసటి రోజు సోమవారం యధావిధిగా యాత్రికులు అమ్మవారిని దర్శించుకోవచ్చని అరుణ్ కుమార్ అన్నారు.